## వేముల మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

పులివెందుల రూరల్, అక్టోబరు 10, ప్రభాతవార్త



సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. వేముల మండలంలోని కొండ్రెడ్డిపల్లెలో రూ.1.68కోట్ల పాడా నిధులతో ఏర్పాటు చేసిన రాజశేఖర్ చెరువు, వాటర్‌ప్లాంటు అలాగే గొల్లలగూడూరులో రూ.80లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ చెరువు ద్వారా దిగువన ఉన్న వేల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి, జడ్పీటీసీ సభ్యుడు వెంకట బయపురెడ్డి, మండలకన్వీనరు నాగేళ్ల సాంబశివారెడ్డి, మండలంలోని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 11 అక్టోబర్ 2022


## ఓటర్లకు పోలింగ్‌బూతులు అందుబాటులో ఉంచాలి

పీలేరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఓటర్లకు అందుబాటులో పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని రాజకీయ నాయకులు కోరారు. సోమవారం పీలేరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అధ్యక్షతన రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి జరిగిన పోలింగ్ స్టేషన్ అన్ని అలాగే పెట్టి ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికల్లో జరిగిన పోలింగ్ స్టేషన్‌లో అలాగే ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఓటర్లుకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదుకూడా పారదర్శకంగా జరగాలని ఎక్కడా రాజకీయ నాయకులు మాటలు విని ఓటర్లను తొలగించరాదని టిడిపి నాయకులు కోరగా ఎక్కడా అటువంటి సమస్య రాదని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జయరామచంద్రయ్య, టిడిపి నాయకలు శ్రీకాంత్‌రెడ్డి, బిజెపి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ వెంకటేష్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


# పీ.డీ. ఖాతాల్లోకే ఆర్థిక సంఘం నిధులు

**పంచాయతీలో తెరిచినా బ్యాంక్ ఖాతాలో జమ చేయని నిధులు**

**ఉమ్మడి కడప జిల్లాలో 1043 గ్రామ పంచాయతీలకు గాను 47 కోట్ల 84 లక్షలు కేటాయింపు**

కడప, అక్టోబర్ 10 ప్రభాతవార్త :





సచివాలయం (ఫైల్‌ఫోటో) సోమవారం సాయంత్రం వరకు పంచాయతీ ఖాతాలో జమకాని ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీలకు మంజూరైన 14-15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరిట తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రామాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు పంచాయతీ ఖాతాల్లో నిధులు లేకపోవడంతో సర్పంచులు నిస్సాహాయ స్థితిలో ఉండిపోయారు. చాలా మంది సర్పంచులు రోడెక్కి తమ నిరసనలు తెలిపారు. కనీసం పంచాయితీల్లో నిధులు లేనందున వీధి బల్బులు, పాడైపోయిన మోటర్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ పనులు చేయలేక చేతులు ఎత్తేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే 565 కోట్లను విడుదల చేసింది. స్థానిక పంచాయితీ బ్యాంకు ఖాతాలో జమచేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ. జిల్లా, మండల పరిషత్ వారిగా కేటాయించిన నిధులన్ని పీ.డి. ఖాతాల్లో జమ అయ్యేలా జిల్లా ఖజానా అధికారి (డి.టి.ఓ) ద్వారా డిపిఓలు కమీషన్ ఆదేశాల మేరకు పీ.డీ. ఖాతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు జమ అవుతున్నట్లు సమాచారం. దీంతో మరోక్కసారి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను దారి మళ్ళించే అవకాశం ఉందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2021-22 15 వ ఆర్థిక సంఘం నిధులు 2022-23 అప్రూవల్ చేస్తూ ఆయా డిపిఓలు ప్రణాళిక చేయడం జరిగింది. 15వ ఆర్థిక సంఘం డేసిక్ అన్నమయ్య జిల్లాకు సంబంధించి 501 గ్రామ పంచాయతీలకు కలిపి 10కోట్ల 56 లక్షల 62 వేలు కేటాయించడం జరిగింది. టైడ్ గ్రాంట్ కింద 26.84 కోట్లు కేటాయించడం జరిగింది. కడప జిల్లా 153 పంచాయితీలకు గాను డైసిక్, టైడ్ కింద 21 కోట్లు కేటాయించడం జరిగింది. అన్నమయ్య జిల్లాలో 553 గ్రామ పంచాయితీలకు గాను 490 పంచాయితీలు ఉన్నాయి. 11 పంచాయితీలో వివిధ కారణాల వల్ల ఎన్నికలు నిర్వహించలేదు. సంబేపల్లె మండలంలో 3, టి.సుండుపల్లెలో 3, పుల్లంపేట మండంలో 2, రైల్వేకోడూరు మండంలో 2 , నందలూరు మండలంలో 1 పంచాయితీలో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేయడం జరిగింది. కడప జిల్లాలో 4 పంచాయితీలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఆ పంచాయతీలకు ప్రత్యేక ఖాతా తెరవలేదని తెలిసింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 569 కోట్లను పీ.డి. ఖాతాలో జమ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఈ నిధులను ఎక్కడ దారి మళ్ళిస్తుందోనని సర్పంచులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. మరో రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా మొత్తం 948.34 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఈ రెండు విడతల ఆర్థిక సంఘం నిధులను ఉమ్మడి కడప జిల్లాకు 26 కోట్ల 84 లక్షలు కేటాయించినట్లు తెలిసింది. సోమవారం పీ.డీ. ఖాతాల్లో ఆర్థిక సంఘం నిధులు జమఅయ్యాయి. అటు అన్నమయ్య జిల్లా, ఇటు కడప జిల్లాలో ఎక్కడా జమకాకపోకపోతో సర్పంచులు మరో రెండు, మూడు రోజుల్లో ఆందోళనలకు, నిరసనలకు స్వీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తారా..లేక విద్యుత్ బకాయిల పేరుతో మరోసారి దారిమళ్ళిస్తారో వేచిచూడాలి.

## స్పందన అర్జీలు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్

రాయచోటి, అక్టోబర్ 10ప్రభాతవార్త:




రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆరో వ్ సత్యనారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యవప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తున్నారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీలను పరిష్కార నివేదికతో పాటు ఫోటో కూడా అప్లోడ్ చేసి పరిష్కరించాలన్నారు. సోమవారం స్పదంన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. వారానికి ఒకరోజు నిర్వహించే స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌లు అందరూ తమ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమరి ్పంచారు. ఈ సమస్యలన్ని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ

## సచివాలయాల్లో సక్రమంగా పనిచేయకపోతే వేటు తప్పదు

**మన్నూరు సచివాలయ ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే మేడా**

రాజంపేట అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త:



మన్నూరు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సచివాలయ, వాలంటరీ వ్యవస్థ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రికని బాపూజి కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసే వ్యవస్థ అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థలో పనిచేస్తూ జవాబుదారితనం లేకుండా ప్రజలకు అందుబాటులో లేకుండా ఇష్టమొచ్చినట్లు పనిచేస్తే వేటు తప్పదని మేడా హెచ్చరించారు. సోమవారం మన్నూరు 12వ సచివాలయాన్ని ఆకస్మికంగా ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వార్డు పరిధిలోని ప్రజల నుంచి సచివాలయం పనితీరుపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని, అందుకే ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీలో సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు పని తీరు వల్లే వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం అక్కడికి వచ్చిన మహిళలతో మాట్లాడి వారికి అవసరమైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల్లో కొందరు మాత్రమే సక్రమంగా పనిచేయడంలేదని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజలను ఇబ్బంది పెడితే సహించమన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి, వైకాపా కౌన్సిలర్‌లు పసుపులేటి సుధాకర్, కటారు శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కటారు సుబ్బరామిరెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి చిదానంద గౌడ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, వడ్డె రమణ, మున్సిపల్ మేనేజర్ శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

## దస్తగిరి ఆరోపణలు అవాస్తవం

**- సకాలంలో స్పందించనందునే గన్‌మెన్ విధుల నుంచి తొలగింపు**

**- అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు**

**- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి**

కడప, అక్టోబరు 10, ప్రభాతవార్త:



దస్తగిరి అనే వ్యక్తి తన గన్‌మెన్లను అనవసరంగా మారుస్తున్నట్లు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఖండించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది మే నెల 29న నగదు లావాదేవీల విషయమై దస్తగిరికి తమ్ముడు వరసైన మస్తాన్ వలీపై పెద్ద గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసేందుకు తొండూరు పోలీసుస్టేషన్‌కు రావడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో దస్తగిరి గన్‌మెన్‌తో స్టేషన్‌కు రావడం జరిగింది. స్టేషన్‌లోనే ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో ఈ విషయమై అప్పట్లో తొండూరు పీఎస్‌లో ఇరు వర్గాల పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ వివరించారు. పై విషయంలో దస్తగిరి గన్‌మెన్ సకాలంలో స్పందించక విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్ల గన్‌మెన్ విధుల నుంచి తప్పించడం జరిగిందని, గన్‌మెన్లను మార్చడమనేది పరిపాలనా పరమైన అంశాల్లో అంతర్భాగమని ఎస్పీ తెలిపారు. రక్షణ కోసం గన్‌మెన్లను కేటాయించబడిన వ్యక్తుల భద్రత దృష్ట్యా మార్చడం జరుగుతుందని ఎస్పీ సూచించారు. దస్తగిరి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఎస్పీ ఖండించారు. ఈ విషయమై అవాస్తవ ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్బురాజన్ హెచ్చరించారు.

# దర్జాగా ... కబ్జా!

**కోట్ల రూపాయలు విలువైన చెరువు స్థలం ఆక్రమణ**

**చెరువు ఆక్రమణలో పలువురి పాత్ర**

**ఆర్డీవోకు రెవిన్యూ సిబ్బంది తప్పుడు నివేదికలు**

**మామూళ్ళతో సరిపెట్టుకుంటున్న పలువురు అధికారులు**

**కృష్ణ మందిరం పక్కనే కబ్జా !**



ఆక్రమణకు గురైన చెరువు మ్యాప్

బద్వేలు, అక్టోబరు 10 ప్రభాతవార్త :



చెరువు స్థలం.

చెరువులు, కుంటలు ఆక్రమణ జరిగిన వెంటనే వాటిని తొలగించాలని ప్రభుత్వం ఎప్పటి నుండో ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ రోజు దర్జాగా చెరువులు, కుంటలు ఆక్రమించుకుంటూ వెళ్తున్నారు. వాటిలో భాగంగానే పట్టణ నడిబొడ్డున ఉన్న నాగుల చెరువు ఆక్రమణపై పలువురి పాత్ర ఉండడం వలన అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీనికి అధికారులు కూడా వత్తాసు పలకడమేగాక కొంత మంది క్రింది స్థాయి సిబ్బంది కబ్జా చేసిన వారి వద్ద మామూళ్ళు తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు రోడ్ కృష్ణ మందిరం పరిసర ప్రాంతంలో చుట్టూ కబ్జాలు జరిగిన మాట వాస్తవం. సర్వే నెంబర్ 1157 కు చుట్టుపక్కల కబ్జా జరిగినట్లు సమాచారం. ఈ సర్వే నెంబరులో యకరా 48 సెంట్లు ఉండగా 2 ఎకరాల వరకు ఆక్రమణ జరిగినట్లు స్పష్టంగా కనపడుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వదిలేశారు. సెంటు స్థలం రూ.10 లక్షలు పైగా విలువ ఉండడంతో కబ్జా చేసేందుకు పూనుకున్న వారు కోట్ల రూపాయలు విలువైన చెరువు స్థలాన్ని దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవిన్యూ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా ఆ ప్రాంతానికి వెళ్ళడం, పరిశీలించి ఏమీ లేదని ఆర్డీవోకు నివేదికలు పంపడం వెనుక అనేక అనుమానాలున్నాయి. వార్తలో చెరువు కబ్జా గురించి ప్రచురణ అనంతరం ఆ ప్రాంతానికి వెళ్ళిన కొంత మంది అధికారులు, సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శించారే తప్ప సర్వే నెంబర్ 1157 లో చెరువు స్థలం ఎంత, వారికి ఉండవలసిన స్థలం ఎంత అనే విషయాన్ని పరిశీలించకుండా ఆ యజమానులు చెప్పిన సమాచారం ప్రకారం వెనుదిరిగి వచ్చినట్లు తెలుస్తుంది. ఆర్డీవో సర్వే నెంబరులోకి వెళ్ళి పరిశీలించలేక పోవడం క్రింది స్థాయి సిబ్బందిని పరిశీలనకు పంపడం, అక్కడ ఉన్న వాస్తవాలను ఆర్డీవోకు తెలుపకపోవడం చూస్తుంటే పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో కూడా చుట్టూ కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ క్రిందిస్థాయి సిబ్బంది మామూళ్ళు తీసుకున్నారని, అందుకే చెరువులో దర్జాగా కబ్జా చేశారని కొంత మంది చెబుతున్నారు. ఇదిలా ఉంటే కృష్ణ మందిరం వెనుక భాగంలో ఉన్న స్థలం కన్నా ఎక్కువగా చెరువును ఆక్రమించుకొని నెమ్మదిగా వారి వ్యాపారాలను పుంజుకుంటూ వెళ్తున్నట్లు సమాచారం. పట్ట పగలు కొద్ది కొద్దిగా చెరువు స్థలం ఆక్రమణ జరుగుతున్నా రెవిన్యూ సిబ్బంది, నీటి పారుదల శాఖ సిబ్బంది అక్కడ ఆక్రమణలు జరగనట్లే వాస్తవాలను కప్పిపుచ్చి ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు అందిస్తున్నట్లు తెలుస్తుంది. చెరువు స్థలం చాలా విలువైనదని, దీని ఆక్రమణ 10 సెంట్లు జరిగినా కోటి రూపాయలకు పైగా విలువైందని భావించాలని, కేవలం క్రిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నిత్యం అడుగుల కొద్దీ చెరువును కబ్జా చేస్తూనే ఉన్నారనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు అక్కడ కబ్జాలే జరగలేదని చెబుతున్నారే తప్ప వాస్తవానికి ప్రాంతానికి వెళ్ళి పరిశీలించి ఆ చుట్టూ ఉన్న యజమానులకు నోటీసులు జారీ చేసి వారి దగ్గర ఉన్న పత్రాలను పరిశీలిస్తే ఎంత స్థలం ఆక్రమణకు గురైందనేది స్పష్టంగా తెలుస్తుంది. కానీ ఇంత వరకూ అలాంటివి జరగకపోవడం వల్లే దర్జాగా కబ్జాలు జరుగుతున్నాయి. వాస్తవాలు వెలుగు చూడాలంటే ఒకసారి కృష్ణ మందిరం పరిసర ప్రాంతాల్లో ఉన్న స్థలం కలిగిన వ్యక్తుల నుండి పత్రాలు సేకరిస్తే వారికి ఉండేది ఎంత? కబ్జాకు గురైంది ఎంత? అనేది స్పష్టంగా వెలుగులోకి వస్తుందనే విషయం తెలుసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# కుప్పకూలిన వేమన కళావేదిక సీలింగ్

**విద్యార్థులకు తప్పిన ప్రమాదం**

**నాసిరకం పనులే కారణమా... అంటున్న ప్రజలు**





చిట్వేలి, అక్టోబరు 10 ప్రభాతవార్త

ఉన్నత పాఠశాల అవసరాల నిమిత్తం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన వేమన కళావేదిక సీలింగ్ ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి కుప్పకూలింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం చిట్వేలి నడివీధుల్లో తిరుగాడిన యుగపురుషుడు వేమన పేరుతో నిర్మించిన 'వేమన కళావేదిక'కు నాబార్డు నిధుల ద్వారా పలు కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం పివిసి సీలింగు, లైటింగ్ తదితర నూతన అంగులతో కూడిన పనులను గుత్తేదారు చేపట్టగా వెరసి ఆరు నెలల లోపలే సంబంధిత వేదిక సీలింగ్ కుప్పకూలడంపై పలు రకాల విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. పాఠశాల గదుల కొరత వల్ల ఆరో తరగతికి పాఠాలు కళావేదిక నందు నిర్వహిస్తూ ఉండగా సెలవు దినం కావడంతో పిల్లలు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని పలువురు అంటున్నారు. దీంతో పాటు ఉన్నత పాఠశాలలోని పలు పనులను నామమాత్రంగా నిర్వహించడం వల్లే ఈ ఇబ్బంది తలెత్తిందని వారు చేసిన మిగతా పనుల్లో ఎంతమాత్రం నాణ్యత ఉంటుందని.?? ఒకవైపు ముఖ్యమంత్రి విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తుండగా గుత్తేదారులు చేపట్టే పనుల్లో నాణ్యత లేకపోవడంపై మండల ప్రజల నుంచి ప్రశ్నలు వినిపిస్తూ ఉన్నాయి. కాగా సోమవారం డిప్యూటీ డిఇఒ వరలక్ష్మీ కుప్పకూలిన కళావేదికను సందర్శించి చేపట్టిన పనులు, కలిగిన ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేధిస్తామని పేర్కొన్నారు. డిఇ నాగిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కారణమైన వివరాలను కమిషనర్‌కు నివేదిస్తామని టానాలో కేసు నమోదు చేశామని తిరిగి వేదిక పనులు పూర్తి చేస్తామన్నారు. కాగా ఇకనైనా పటిష్టంగా పాఠశాల పనులు చేపట్టాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యావంతులు, అధికారులను కోరుతున్నారు.

**తిమ్మాయపాలెం పాఠశాల పరిసరాల ఆక్రమణపై వివరణః-**

మండల పరిధిలోని తిమ్మాయపాలెం పాఠశాల ఆవరణంలోని ఖాళీ స్థలాన్ని చదును చేసి కొందరు కబ్జా చేస్తున్నారని ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చిందని డిప్యూటీ డిఇఒ వరలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం తిమ్మాయపాలెంలోని పాఠశాలను సందర్శించి గ్రామస్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఆ స్థలం విషయంలో విచారించారు. వేగంగా పూర్తిస్థాయిలో ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మహేశ్వర్‌రావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, సిఆర్‌పిలు చంద్ర, ధర్మేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి : కలెక్టర్



కడప, అక్టోబర్ 10 ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు జేసి సాయికాంత్ వర్మ, డిఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, డ్వామ పీడి యదుభూషన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, చంద్రమోహన్, అనుడ విసి శ్రీలక్ష్మిలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.

# గృహ నిర్మాణ లక్ష్యాన్ని నిర్దిష ప్రణాళికతో సాధించండి

**జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్**

కడప, అక్టోబర్ 10 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న జగనన్న గృహ నిర్మాణాలు నిర్దేశిత లక్ష్య సాధన దిశగా అడుగులేస్తూ ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభావనం నుండి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు-పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి హౌసింగ్ ఇంజినీర్ అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్ట్రీలతో టై అప్, ఇసుక, ఐరన్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి.. నిర్మాణ పలనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. జగన్నన గృహనిర్మాణాలలో ఎలాంటి లోటు పాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను ఆధికమించాలన్నారు. అధికారులు సమావేశనికి వచ్చేముందు సమగ్ర నివేధికాలతో అవగాహన కలిగి అడిగిన ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానం చెప్పాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలన్నారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇంపార్టెన్స్ ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకోని పనిచేయాలని పేర్కొన్నారు.

# క్రీడలకు ఆదరణ కరువు

రాయచోటి, అక్టోబర్ 10ప్రభాతవార్త:



క్రీడలకు ఆదరణ తగ్గుతుంది. గతంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మంచి క్రీడా ప్రాంగణాలు ఉండేవి. ప్రతి పాఠశాలకు ఓడ్రిల్ మాస్టర్ ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఇక ప్రైవేటు పాఠశాలల పరిస్థితి క్రీడల విషయంలో మరింత దారుణంగా ఉంది. తల్లిదండ్రుల ఆలోచన సరళిని ఒడిసి పట్టుకుంటున్న ప్రైవేటు యాజమాన్యాలు ర్యాంకుల ప్లెక్సీలు చూపుతూ ఆశలు రేకెత్తిస్తున్నాయి. కానీ క్రీడల పట్ల ఆసక్తిని పెంచలేకపోతున్నాయి. క్రీడల అవసరాన్ని గుర్తిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులేస్తుంది. విద్యార్థులు ర్యాంకుల వలయంలో పడి క్రీడలపై ఆసక్తి చూపడం లేదని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా సామా గ్రికి నిధులు లేకపోవడంతో క్రీడలు కుంటుపడుతున్నాయని పలువురు సీనియర్ క్రీడాకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానాలు ఉన్న అవి క్రీడాకారులకు ఉపయోగకరంగా లేవని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో క్రీడాకారుల అభివృద్ధికి ఎన్నో పథకాలు ఉన్న ప్రభుత్వం క్రీడా సామాగ్రి సమకూర్చడానికి నిధులు కొరత ఏర్పడింది. చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు, కంపచెట్లు, పిచ్చిమొక్కలతో పెరిగిపోయిఉన్నాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫలితాల్లో మార్కులు, రా ్యంకులుపైన ఉన్న శ్రద్ధ క్రీడలపై లేకపోవడం దారుణమని క్రీడా మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైన ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అవసరమైన వసతులు కల్పించాలని నిధుల కొరత లేకుండా మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## జగన్ ప్రభుత్వంలో రైతులకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



వార్త III వ పేజీలో

## నేనూ రైతు బిడ్డనే.. మీకు అండగా ఉంటా...

### – ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

**తంబళ్లపల్లె, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



దశాబ్దాలుగా తంబళ్లపల్లె నియోజక వర్గంలోని రైతులు పంటలపై ఆధారపడి కష్టాలు పడుతున్నారని వారిని అన్ని విధాలా ఆదుకోవడానికి నేను అండగా ఉంటానని వారికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హర్షధ్వానాలు మధ్య హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో మండలంలోని రైతులకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు తంబళ్లపల్లె వేరుశనగ పంటకు పెట్టింది పేరని అలాంటిది నేడు వేరుశనగ పంట పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నట్లు చెప్పారు. రైతాంగం వ్యవసాయ బోర్లు వేసుకొని ప్రత్యామ్నాయ పంటలు, పండ్ల తోటలు, మల్బరీ సాగు చేపట్టాలని ఇందుకు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. నేడు ఆర్‌బీకే కింద రైతుకు లబ్ధి చేకూరడమే కాక తన చెంతనే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు సబ్సిడీపై ఇచ్చినట్లు చెప్పారు. పది మందికి అన్నం పెట్టే రైతన్న పచ్చగా ఉంటేనే రాజ్యం బాగుంటుందని రైతుల సంక్షేమం కోసం నేడు రాజకీయాలకు అతీతంగా అడిగిన ప్రతి రైతుకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులకు అండగా ఉంటానని తనకు అధికారులు, ప్రజా ప్రతి నిధులు, కార్యకర్తలు సహకారం అందించాలని కోరారు. తొలుత కోసువారిపల్లె సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ కోటిరెడ్డి స్థానిక నాయ కులు, రైతులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అభి వృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, ఆర్‌బీకే ఛైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, ములకల చెరువు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిని సురేంద్ర, ఆర్‌బీకే డైరెక్టర్ శంకర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ భార్గవ్ రెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, విద్యుత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### గడప గడపలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

**మదనపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**



ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే నవాజ్ బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డు బసినికొండ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యేనిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం నవరత్నాల పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వార్డుల్లో ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేయడం జరుగుతుందతన్నారు. అర్హులైన వారు పథకాలకు ధరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, కౌన్సిలర్లు వసీమ్, సుగుణ, శారదారెడ్డి, ఎస్‌వి.రమణ, నాయకులు రఫీ, ఇర్ఫాన్‌ఖాన్, ఆర్‌ఓ పల్లవి, డిఈ శిరీష పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించి యంత్రాలు తరలించాలి

### స్పిన్నింగ్‌మిల్ నాయకులు డిమాండ్

**మదనపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**




దశాబ్దాల క్రితం మూత పడ్డ మదనపల్లె స్పిన్నింగ్‌మిల్ కార్మికులకు పూర్తిస్థాయి బకాయిలు చెల్లించి యంత్రాలను తరలించాలని టిఅండ్‌టి ఈసి ఆర్గనైజింగ్ సెక్రటరీ నందగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోనే పెద్ద కాటన్‌మిల్లుగా ప్రసిద్ధి చెందిన మదనపల్లె స్పిన్నింగ్‌మిల్ యాజమాన్యం అప్పులు చేసి కార్మికులను రోడ్లపాలు చేసిందన్నారు. కార్మికులకు కోట్ల రుపాయలు అప్పులు చెల్లించాలని, రుణసంస్థలు కర్నాటకాలో కోర్టును ఆశ్రయిం చడంతో కోర్టు ఆదేశాను ప్రకారం కార్మికుల బకాయిలు చెల్లించిన తరువాత రుణ బకాయి దారులకు చెల్లించాలన్నారు. స్పిన్నింగ్‌మిల్ బకాయిలను వరతట్టుకొన్న పిఆర్‌సి బ్యాంకు ఆన్‌లైన్ ద్వారా వేలం నిర్వహించి మిల్లు యంత్రాల అమ్మకాలు సాగించాలని తెలిపారు. రూ.10.25కోట్లు కార్మికులకోసం కోర్టుద్వారా జమ చేయాలన్నారు. బకాయిలు చెల్లించకుంటే యంత్రాల తరలింపును అడ్డుకొంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డప్పరెడ్డి, రాజారెడ్డి, వెంకటరమణారెడ్డి, రఘురామ్‌రెడ్డి, వెంకటరత్నం, అప్పిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలో రైతులకు సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి





**పెద్దతిప్ప సముద్రం అక్టోబర్ 10, ప్రభాతవార్త**

వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పరిపాలనలో రైతు లకు ఎన్నో సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేసి చూపిస్తున్నారని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పి టి ఎం లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రోజున విద్యుత్ ట్రాన్స్ఫారం మేళ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దొరకనాథ్ రెడ్డి రైతులతో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రైతులకు ప్రభుత్వ పథకాలతో ఎంతో లబ్ది చేకూరుతుందని అన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయ రైతులకు గత ప్రభుత్వం పాలన లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు లేక రైతులు ఎన్నో కష్టాలు పడ్డారు ఆ ఇబ్బంది లేకుండా ఈరోజు రైతన్నల సంక్షేమం కోసం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు రైతులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక రైతు కు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తున్నామన్నారు. అంతే కాకుండా నేడు రైతు సాది కారత రైతు కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన సంక్షేమ పథకాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పి టి ఎం మండలం ప్రజలు అంటే తనకు చాలా గౌరవమని వారి ఆశీర్వాదాలు తనపై ఎప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే ప్రేమతో ప్రసంగించారు. నియోజకవర్గంలోని రైతుల కోసం ప్రత్యేక శ్రద్ధతో దాదాపు 3000 వేల విద్యుత్ ట్రాన్స్ఫారం లు మంజూరు చేశామని రానున్న రోజుల్లో కొత్తగా రైతులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయిస్తామని నియోజకవర్గ లోని అన్ని మండలాల్లో విద్యుత్ ట్రాన్స్ఫారం లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొహమ్మద్. జడ్పిటిసి శివన్న. ఎంపీడీవో గిరిధర్ రెడ్డి. ఇంచార్జ్ తహసిల్దార్ విద్యాసాగర్ రావు. ఏవో ప్రేమలత. ట్రాన్స్కో ఏఈ రామ లక్ష్మయ్య. ఏపీఎం సాంబశివ.ఆర్ బి కె భాస్కర్ రెడ్డి. జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు కుమార్ రెడ్డి. ప్రత్యేక ఆహ్వానితులు సుబ్బురాం. సర్పంచులు తమక శంకర్ సుబ్బిరెడ్డి భాగ్యమ్మ నారాయణరెడ్డి. రహమతుల్లా. జక్కల రామాంజులు. పూల గిరీష్. అనసూయ మంజునాథ రెడ్డి. భాస్కర్ నాయుడు. చెరువు నరసమ్మ. వైసిపి నాయకులు కొండా సిద్దార్థ ఉప సర్పంచ్ లు మధుకర్ రెడ్డి. మల్లెల వెంకట.జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటర్ కమిటీ సభ్యులు కె.వి రమణ. ఆర్డబ్ల్యూఎస్ మెకానిక్ చంద్రశేఖర్.ఎంపిటీసీలు కార్యం చంద్ర. సయ్యద్ భాష. కిట్టన్న. కేశవ. వైస్ ఎంపీపీ. శోభ శంకర్. కో ఆప్షన్ ఖాదర్ వలీ. స్కూల్ కమిటీ చైర్మన్లు మహబూబ్ బాషా. తలారి మంజునాథ్. వాటర్ షెడ్ చైర్మన్లు శ్రీనివాసులు రెడ్డి. రఘునాథ్ రెడ్డి. సింగల్ విండో డైరెక్టర్ జై చంద్రారెడ్డి. జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్. వైసిపి నాయకులు సాదిక్ భాషా. వెల్డర్ బాబు. వెంకట్ రెడ్డి. రఘునాధ రెడ్డి. ఎం.ఎన్. వెంకటరమణ.నక్క మహేష్. జాబీర్. ఎం ఎం ఫయాజ్. సిద్ధూ. ట్రాన్స్కో సిబ్బంది రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదికి మూడు సిలిండర్లు అనే వాదనను తిప్పికొట్టాలి

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు చాలు అనే వాదనను రాష్ట్రంలోని అధికారంలో ఉన్న వైఎస్ఆర్ పార్టీ విపక్షం పార్టీ తెదేపా తిప్పి కొట్టాలని జేకేయూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఏడాదికి 3 సిలిండర్లుచాలవా అని వ్యంగ్యంగా జవాబు ఇవ్వడం బీజేపీ దాష్టీకానికి నిదర్శనమన్నారు. సోమవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రజల పట్ల కేంద్రం అవలంభిస్తున్న తీరుపై మండి పడ్డారు. వైసీపీ, టీడీపీ ఒకిరి నొకరు ఎత్తిపోసుకోవడం కాదని చిత్తశుద్ధి ఉంటే కేంద్రం యోచిస్తున్న ఏడాదికి 3సిలిండర్ల విషయాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

## వర్షం దెబ్బతో టమో(రా)

### – పొలాల్లోనే రాలిపోతున్న టమోటా

**బి.కొత్తకోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**



వారం రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి టమోటా పంట పూర్తిగా దెబ్బ తింటోంది. చేతికి వచ్చిన పంట పొలాల్లోనే రాలిపోతోంది. దీని వలన టమోటా రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుత టమోటా పంట బాగా కాపుకొచ్చింది. పంటలు బాగా పండాయని అను కుంటున్న తరుణంలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో పండిన పంట పూర్తిగా దెబ్బతినిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్ల ముందే పండిన పంట నేల రాలిపోతుండడం, చెట్టు ఆకులన్నీ నల్లగా మారిపోతుండడం, తెగుళ్ల సోకడం జరుగుతోందని, భారీగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన టమోటా పంట పూర్తిగా దెబ్బతినడంతో భారీగా నష్టం వాటిల్లిందని టమోటా రైతులు వాపోతున్నారు. ఎకరం పంట సాగు చేయాలంటే దాదాపు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టడం జరిగిందని, పంట దెబ్బతినడంతో అప్పులే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నా పంట వర్షానికి దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక పూర్తిగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని టమోటా రైతులు కోరుతున్నారు.

## స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించండి : ఎస్‌పి

**కడప క్రైం, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ స్పందన కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

## మైనర్ బాలికను మోసగించిన వ్యక్తులు అరెస్ట్

**కడప క్రైం, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, పెళ్లి చేస్తున్నట్లు నమ్మించి గర్భ వతి అయ్యే విధంగా తన కుమారుడిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అరెస్టు చేసినట్లు దిశ పోలీసుస్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.వాసు దేవన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కడప నగరం మృత్యుంజయకుంట వీధికి చెందిన మైనర్ బాలికకు తమ కుమారుడు షేక్ నూర్ బాషా అలియాస్ సోనుతో మాయ మాటలు చెప్పించి ప్రేమించినట్లుగా నటించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారిద్దరికి పెళ్లి చేసినట్లు పూల దండలు మార్చి పెళ్లి జరిగినట్లు తెలిపి పలుమార్లు లైంగిక దాడి చేసి బాలికను గర్భవతి అవగానికి కారణమైన షేక్ నూర్‌బాషా తల్లిదండ్రులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మైనర్ బాలికలకు వివాహం చేయడం కానీ, వాటిని ప్రోత్సహించడం కానీ చేసిన వారిపైన పీఓసీఎస్‌ఓ చట్టం కింద చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌లో మెరిసిన ఆణిముత్యాలు

**తంబళ్లపల్లె, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మోడల్ స్కూలుకు చెందిన ఎస్.సమీరా, కె.వేదశ్రీ ఇరువురు బాలికలు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తమ సత్తాచాటినట్లు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు మాసంలో నంద్యాల జిల్లా కోయిల కుంట్లలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సంపాదిం చినట్లు ఆయన తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించడం హర్షణీయమన్నారు. ఇరువురు విద్యార్థులు క్రీడా ప్రదర్శన వెనక పీడీ లత, జిల్లా షూటింగ్ బాల్‌కోచ్ యూసఫ్ ఉన్నారని ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం తోనే వారు ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. పీడీ లత, కోచ్ యూసఫ్‌లు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో తాము ఎంచుకున్న రంగంలో కష్టపడి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. అనంతరం ఇరువురు క్రీడాకారిణిలను సత్కరించి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

## వెలుగుస్కూల్‌లో మానసిక ఆరోగ్య దినోత్సవం

**మదనపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమం సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కూడు, గుడ్డ, నీడ ఎంత అవసరమో అలాగే మానసిక ఆరోగ్యం కూడా అంతే అవసరం అన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్న వెలుగు సంస్థ మరింత ముందుకు రావాలని కోరారు. వర్డ్ పెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ వారు డబ్ల్యుహెచ్‌ఓ సహకారంతో అక్టోబర్ 10ని ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండి ఆత్మసైర్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం.గీత పాల్గొన్నారు.

## కారు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**

కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పిటిఎం మండలం టి.సదుం గ్రామానికి చెందిన శ్రీకాంత్(23) ఇతని మామ మంజునాథ్ (26)లు సోమవారం సొంత పనులపై ద్విచక్రవాహనంలో మండలంలోని తుమ్మరకుంటకు బయలుదేరారు. దారిలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

**కలికిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:**

మండలంలోని గుండ్లూరు గ్రామానికి చెందిన పి.ముబారక్‌ఖాన్(38) అదృశ్యం కావడంతో భార్య గోహీర్‌జాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ముబారక్‌ఖాన్ ఈనెల 5న వాల్మీకిపురంలో ఓ వ్యక్తి వద్ద కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5న కార్పెంటర్ పని నిమిత్తం వెళ్లి ఇంటికి రాలేదు. ఆయన భార్య ఫిర్యాదు చేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం..

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



ఈనెల 5వ తేదీన ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖకు సోమవారం ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి మండలంలోని ఉత్తమ ఫలితాలు సాధించి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని అలాగే ఎన్ఎంఎంఎస్‌కు 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఇదంతా పాఠశాల ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల సత్‌ప్రవర్తనతో పాటు మంచి ఫలితాలు సాధించారు. పాఠశాలకు కూడా మంచి పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు, నాగయ్య, ఆఫీషా బేగం, శ్రీకళ, మురళీ నాయక్, అరుణకుమారి, సోమశేఖర్ నాయక్, రసూల్, సుధీర్ భారతి, ప్రసాద్, ఉమా మహేశ్వరి, పగడపుల దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం : సిపిఎం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త:**




దేశంలో ప్రతి ఇంటికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు సరిపోవా అంటూ కేంద్రఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చేసిన వ్యాఖ్యల పట్ల సీపీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. ఇక నుంచి సంవత్సరానికి సిలిండర్లు 3 మాత్రమే సాధారణ ధరకు ఇవ్వాలని, 3 సిలిండర్లు దాటితే ఒక్కో సిలిండరు మీద రూ.500 అదనంగా చెల్లించాలనే ప్రతిపాదన చర్చలో ఉందని, ఈ విషయం మీద ఢిల్లీలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ని ప్రశ్నించగా ఈరకంగా వ్యాఖ్యానించాని ఆయన అన్నారు. అవును చర్చ జరుగుతుంది. సంవత్సరానికి 3 సిలిండర్లు సరిపోవా? అని మాట్లాడడాన్ని రామమోహన్‌రావు తప్పు పట్టారు. బీజేపీ ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లే అన్నారు. దేశప్రజలు బీజేపీకి అధికారం ఇచ్చింది సామాన్య ప్రజల ప్రయోజనం పరిరక్షించడానికి మాత్రమే అని, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను రక్షించడానికి కాదనే విషయాన్ని గమనించాలని ఆయన హెచ్చరించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్య ప్రజల ఆదాయాలు పెంచే ప్రయత్నాలు ఏపీ బీజేపీ ప్రభుత్వం చేయడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరిస్తా

### కార్పొరేటర్ గౌస్‌బాషా (చాక్లెట్)

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



33వ డివిజన్ పరిధిలోని బెల్లం మండి వీధికి చెందిన కొందరు మహిళలు కార్పొరేటర్ గౌస్‌బాషా(చాక్లెట్) కార్యాలయం వద్ద సోమవారం రోడ్డు సమస్య గురించి తెలిపారు. అందుకు స్పందించిన గౌస్ బాషా మాట్లాడుతూ ఈ విషయం డిప్యూటీ సీఎం అంజాద్‌బాసా, నగర మేయర్ సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా రోడ్డు సమస్యతో పాటు ఇతర సమస్యలను తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## మహా ప్రవక్త జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయం

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



స్థానిక రహ్మతుల్లావీధిలోని చాంద్ పిరా గుంబద్ దర్గా వద్ద ఉన్న మిలాద్ ఘర్‌లో పవిత్రమైన మిలాదున్నబీ మాసోత్సవాలను పురస్కరించుకొని మిలాదు న్నబీ కమిటీ ఆధ్వర్యంలో జస్నే మిలాదున్నబీ ఆధ్యాత్మిక సభా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాదుకు చెందిన ముఫ్తి మొహమ్మద్ ఆజం నద్వి సాహెబ్, సభ అధ్యక్షులుగా దారుల్ ఉలూమ్ జియావుల్ బాఖియాత్ ప్రిన్సిపల్ మౌలానా సయిద్ అహ్మద్ బాక్వి సాహెబ్, గౌరవ అతిథిగా జామియా తుస్ సలి హాత్ ప్రిన్సిపాల్ మౌలానా ఖాజీ అబ్దుల్ జబ్బర్‌నదివి సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తు మహాప్రవక్త మహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయమన్నారు. మొహ్మద్ ప్రవక్త జీవిత విశేషాల గురించి పలు విషయాలు తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిలాద్‌కమిటీ అధ్యక్షులు, మాజీమంత్రి హాజీ ఎస్ఎండీ అహ్మదుల్లా, ఉపాధ్యక్షులు ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సెక్రటరీ మొహమ్మద్ అలీఖాన్, సభ్యులు షేక్‌నయాముద్దీన్, సభ్యులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్ర ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జిగా డీసీసీ షేక్ నజీర్ అహ్మద్

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు సంబంధించి రాష్ట్రంలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జిగా కడప జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ నజీర్‌అహ్మద్‌ను ఏపీసీసీ నియమించింది. ఈ సందర్భంగా షేక్‌నజీర్ అహ్మద్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన మహోత్తర భారత్ జోడో పాదయాత్రకు సంబంధించి రాష్ట్రంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జిగా తనను నియమించినందుకు ఏపీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## విశ్వప్రవక్త అవశేషాలు ప్రదర్శించడం

### దర్శించుకోవడం మహాపుణ్య కార్యం : వైసీపీ యువనేత డా.సుహైల్

**కడప ఏడురోడ్లు, అక్టోబరు 10, ప్రభాతవార్త**



మహా ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా ఆసారే షరీఫ్ (ప్రవక్త అవశేషాల ప్రదర్శన) నిర్వహించడం మహా పుణ్య కార్యమని వైసీపీ యువనేత డా.సుహైల్ అన్నారు. స్థానిక బురహాన్ దీన్ వీధిలోని మాజీ కార్పొరేటర్ మున్నా గృహంలో ఆదివారం రాత్రి ఆసారే షరీఫ్ ప్రదర్శనకు ఉంచారు. ముఖ్య అతిథులుగా డా.సుహైల్‌తో పాటు కార్పొరేటర్లు అలీ అక్బర్, గౌస్‌బాషా (చాక్లెట్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసారే షరీఫ్‌ను దర్శించుకోవడం అందరికీ లభించే అదృష్టం కాదని, కొందరికే ఆ అదృష్టం అని అది తమకు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## వాల్మీకి అంశమే కవయిత్రి మొల్ల

**బద్వేలు, అక్టోబరు 10 ప్రభాతవార్త :**



ఆది కవి వాల్మీకి మహర్షి అంశమే మహా కవయిత్రి మొల్ల అని ప్రముఖ సాహితీ వేత్త శ్రీరాఘువరాజు పట్టాభిరామరాజు అన్నారు. వాల్మీకి మొల్లమాంబ కారణ జన్ములని పేర్కొన్నారు. పట్టణంలోని మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి సభలో రాఘువరాజు పట్టాభిరామరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి, వారు ప్రసంగిస్తూ వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలతో సంస్కృత రామాయణాన్ని రచించారన్నారు. నారథ మహర్షి ఉపదేశించిన రామ మంత్రం దోపిడీ దొంగగా జీవిస్తున్న రత్నకరుణ్ణి వాల్మీకి మహర్షిగా మార్చివేసిందన్నారు. సభ అధ్యక్షులు విద్వాన్ డా॥ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని మొల్లమాంబ అనేక చేర్పులు మార్పులు చేసి స్వేచ్ఛానువాదం చేసిందని పేర్కొన్నారు. సాహితీ లోకంలో వందలాది రామాయణాలు ఉన్నా మొల్ల రామాయణానికి ఒక విశిష్టత ఉందన్నారు.కార్యక్రమంలో గణేష్, స్వర్ణలత, మోహన్ వర్మ, పార్వతి పాల్గొని వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని ప్రశంసించారు.

## గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

### డిప్యూటీ డియంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

**మైదుకూరు అక్టోబర్ 10, ప్రభాతవార్త**



పౌష్టికహారం పై ప్రతి ఒక్క గర్భిణీ మహిళకు అవగాహన కలిగి ఉండాలని బద్వేలు డిప్యూటీ డియంహెచ్ ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం డాక్టర్ ఎస్. ముబీనా ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణీ మహిళలతో మాట్లాడుతూ అందరు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకొని, ఆరోగ్యంగా ఉంటూ పండంటి బిడ్డకు జన్మను ఇవ్వాలన్నారు. ప్రతి గర్భవతి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసావాలు సురక్షితమని, చలి కాలం దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటించాలని, ఆయన తెలియజేశారు. పౌష్టికహారం అంటే, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిక్కీలు, ప్రతి రోజు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే గుడ్లు, పాలు, భోజనం, తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏఎన్‌యం లు ఇచ్చే టీకాలు, మందులు, మాత్రలు, సూచనలు, సలహాలు, తప్పకుండ తీసుకొని గర్భంలో ఉండే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం జరిగేటట్టు చేస్తారని, ప్రభుత్వ ఆసుపత్రులు 24 గంటలు పని చేస్తాయని, గర్భవతులు ప్రభుత్వం ఇచ్చే ఆరోగ్య పథకాలు వినియోగించుకోవాలన్నారు. గర్భిణీ మహిళలకు రక్త హీనతను గురించి ఆయన తెలిపారు. తరవాత వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రతను గురించి తెలియజేశారు. వైద్య సిబ్బందికి అన్ని జాతీయ కార్యక్రమాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైరిస్క్ గర్భిణీ మహిళలు 6 మందిని గుర్తించారని ఆయన తెలియజేశారు. అనంతరం ప్రతి నెల 10 వ తేది జరిగే 'అంగ వైకల్య మరియు వైద్య పునరావాస శిబిరం ( డిపియంఆర్) క్యాంపును ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సిహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, ఆశానోడల్ పర్సన్ అరుణకుమారి, లెప్రసి నోడల్ అధికారి సునీల్ కుమార్, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, ఏఎన్‌యంలు, యంఎల్‌హెచ్‌పిలు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్ట్ కేశవయ్య, ఎల్‌డి కంప్యూటర్ ఉదయ్‌కుమార్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన దొడ్డపనేని

**కడప అక్టోబర్ 10, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ను ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ లోని స్వగృహంలో కలసిన తెలుగునాడు విద్యుత్ సంఘము రాష్ట్ర నాయకుడు దొడ్డపనేని రాజా చంద్రశేఖర్ నాయుడు కలిశారు. గ్రామాల్లో టీడీపీకి సాను కూలంగా ఉంది అని సోషల్ సామాజిక మీడియా వేదిక తన పార్టీ బలోపేత కార్యక్రమం చూపించినారు. పార్టీ బలోపేతం చేయడానికి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పలు సూచనలు చేశారు. మాజీ రాష్ట్ర కార్యదర్శిగా దొడ్డపనేని రాజానాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రజాధనం కాపాడటమే లక్ష్యం : ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు అక్టోబర్ 10, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల ధనాన్ని కాపాడటమే తన ప్రధాన లక్ష్యంగా ది ప్రొద్దుటూరు కోపరేటివ్ టౌన్ బ్యాంక్ అధ్యక్షులుగా కుమార్‌రెడ్డిని కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్ల శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం స్థానిక ఏ కె ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన టౌన్ బ్యాంక్ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా టౌన్‌బ్యాంక్ ఎన్నికల అధికారి అధ్యక్షులుగా వెల్లాల కుమార్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా అక్రమ్ మహమ్మద్ గౌస్‌తో కలిపి పదిమంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయించారు వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వెల్లాల కుమార్‌రెడ్డి తన వెంట నడవక పోయినా బ్యాంకు అభివృద్ధికై నాలుగు గఫాలుగా అధ్యక్షులుగా సేవలను అందిస్తు న్నారన్నారు ఉపాధ్యక్షులుగా మైనారిటీకి చెందిన అక్రమ్ మహమ్మద్‌గౌస్ తిరిగి నియామకం కావడం సంతోషకరమన్నారు పాలకమండలి పాలనలో బ్యాంకు పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి కౌన్సిలర్లు అనిల్‌కుమార్ కమల్ భాష వైసిపి నాయకులు నాగేంద్రరెడ్డి రాగా నరసింహారావు, చిన్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 10, ప్రభాతవార్త:**




స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) చెన్నై ట్రైనర్స్ డా.జి.కులంతవేల్, డా.కె.ఎస్.గిరిధరన్, డా.ఆర్.శాంతకుమార్, ఆర్.రాజేంద్రన్‌లు సోమవారం నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజల పాటు ఇన్స్ట్రక్నల్ డిజైన్ అండ్ డెలివరి సిస్టమ్స్ అనే అంశంపైన నేషనల్ లెవెల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ డా.పాండు రంగన్ రవి తెలిపారు. మొదట వైస్ ప్రిన్సిపల్ డా.ఎవెంకటేవ్వరరెడ్డి ట్రైనర్లకు ఆహ్వానం పలికారు. అనంతరం ట్రైనర్స్ అధ్యాపకులకు టీచింగ్ ప్రాసెస్, టీచింగ్ నాలెడ్జ్, టీచింగ్ స్కిల్స్ అంఆల గురించి తెలియజేస్తూ అధ్యాపక వృత్తిలో పురోభివృద్ధి సాధించడానికి వీటి ఆవశ్యకత గురించి తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, హెచ్‌ఓడీలు 50మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**కడప లీగల్, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.కవిత కడప పురుషుల కేంద్ర కారాగారం స్త్రీల కేంద్రం కారాగారం నందు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం 2022 థీమ్ అందరికీ మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును ప్రపంచ ప్రాధాన్యతగా పరిగణించాలి. ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్యం గురించి అవగాహన పెంచడానికి మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వారికి మద్దతు ఇచ్చే ప్రయత్నాలను సమీకరించడానికి ప్రతి సంవత్సరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. రుగ్మతలతో బాధపడుతున్న వారు భారత దేశంలో లక్షల మంది ఉన్నారు. వ్యాయామం క్రమం తప్పకుండా చేయడం వల్ల శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండవచ్చు. సాధారణ శారీరక శ్రమ మెదడకు ప్రయోజనం చేకూరుస్తుంది. యోగా, నడక, ఈత, పరుగు సహ శారీరక శ్రమ కలిగించే ఎలాంటి వ్యాయామం వల్ల అయినా మంచి ప్రయోజనం ఉంటుంది. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ శాఖాధికారి సంస్థ కడప వారి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మానసిక వ్యాధిగ్రస్థులైన ఖైదీలు సిబ్బంది పాల్గొన్నారు.

## ములాయంసింగ్ యాదవ్ మరణం తీరని లోటు

**కడప వైద్య విభాగం, అక్టోబరు 10, ప్రభాతవార్త:**

ములాయంసింగ్ యాదవ్ జాతీయ భావాలు గల నాయకుడని, కేంద్ర ప్రభుత్వ రక్షణశాఖ మంత్రిగా 3 పర్యాయాలు ముఖ్యమంత్రిగా, భారత ప్రజలకు నసేవ చేసిన గొప్ప నాయకుడు ములాయంసింగ్ యాదవ్ అని ఆయన మరణం భారత ప్రజలకు తీరని లోటని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు కొనియాడుతూ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి

**పులివెందుల, అక్టోబరు 10, ప్రభాతవార్త :**



ఈక్రాప్ బుకింగ్ చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. పులివెందుల వ్యవసాయ కార్యాలయాన్నిసోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మండలంలో 78శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు.కార్యక్రమంలో ఎంపీఈవోలు హరిత, స్వాతి, ఏటీఎం రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**రామాపురం, అక్టోబర్ 10ప్రభాతవార్త:**

లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి నేషనల్ హైస్కూల్, ఇండియన్ పెట్రోల్ బంక్ అధినేత లయన్ అశోక్‌రెడ్డి, లయన్ లావణ్య పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సౌజన్యంతో స్థానిక బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమం నందు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సహాయం చేసే అవకాశం కలగడం భగవంతుడు మానవులకు ఇచ్చిన గొప్పవరమన్నారు. అలాగే ప్రతి ఒక్కరు తమ పెళ్లిరోజు, పుట్టినరోజులు ఇతర శుభ కార్యాలయాలకు డబ్బులు వృధా చేయకుండా ఇలా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్య క్రమాలు చేయాలని కోరారు. అనంతరం దాత లయన్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సోమవారం పెళ్లిరోజు పురస్కరించుకొని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే గొప్ప సంకల్పంతో మన లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారిచే ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడే మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి. హరీష్ చంద్ర, ఆశ్రమం దేవనాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## బోయపాటివాండ్లపల్లెలో మంచినీటి బోరును ప్రారంభించిన జగన్‌మోహన్ రాజు

**వీరబల్లి, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



ప్రముఖ విద్యావేత్త, టిడిపి రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం రాజంపేట నియోజకవర్గ పరిధిలోని వీరబల్లి మండలం సోమవరం గ్రామ పంచాయతీలోని బోయపాటివాండ్లపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజుకి మహిళలు, గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. జగన్‌మోహన్‌రాజుకి గజమాలవేసి, అడుగడుగునా బాణా సంచా పేల్చుతూ ఘన స్వాగతం పలికారు. బోయపాటివాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును జగన్‌మోహన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామస్తులందరూ కలిసి ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రం అబివృద్ధి చెందాలన్నా, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అందరూ కలిసి టిడిపి బలోపేతం కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మండల కమిటీ ఉపాధ్యక్షుడు దుర్గం అంజినేయులు, మండల మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బయ్య, సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి, నాగసుబ్బయ్య నాయుడు, జయచంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు అబ్బూరి నాగరాజనాయుడు, అంజినేయులరెడ్డి, భాస్కర్‌రాజు, సుధాకర్ రాజు, నరసింహా నాయుడు, నాగప్పనాయుడు, ఆటో శివ, టిడిపి పవన్, వి.ఆంజనేయులు, రామకృష్ణ, చలపతి, రాచరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్పెషల్ ఆఫీసర్‌గా హిమశైల

**ఒంటిమిట్ట అక్టోబర్ 10 ప్రభాతవార్త:**

మండల స్పెషల్ ఆఫీసర్‌గా హిమశైల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమ వారం ఆమె ఎంపిడిఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్పెషల్ ఆఫీసర్‌గా వున్న బ్రహ్మయ్య బదిలీ ఆయ్యారు. మార్కెటింగ్‌శాఖ ఏడిగా పని చేస్తున్న హిమశైలను మండల స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు.

# తపాలాసేవలు సద్వినియోగం చేసుకోవాలి

**కొండాపురం, అక్టోబరు 10, ప్రభాతవార్త :**



తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ సూపరింటెండెంట్ రవిబాబు అన్నారు. ఆయన సోమవారం తపాలా వారోత్సవాల్లో భాగంగా కొండాపురం పోస్టాఫీసులో ఇన్సూరెన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తపాలా సేవలు, ఇన్సూరెన్సుకు తక్కువ ప్రీమియం, బోనస్ ఎక్కువ అన్నారు. చిన్న పొదుపు ఖాతాలకు అధిక వడ్డీ రేటు ఉంటుందని, అందరు తపాలాశాఖలో భాగం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కరోజులోనే రికార్డు స్థాయిలో రూ.405367 ప్రీమియం చేయించిన కొండాపురం పోస్టుమాస్టర్ నాగప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆయన ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జమీర్‌హుసేన్, జిలానిబాషా, స్టెనోగ్రాఫర్ అమర్, ఆఫీస్ అసిస్టెంట్ చిన్నబాబు, కొండాపురం, లావనూరు, తాళ్లప్రొద్దుటూరు, ముద్దనూరు పోస్టల్ పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

# రాయలసీమకు ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**వేంపల్లె, అక్టోబరు 10, ప్రభాతవార్త :**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ఏపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో మేరకు రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ తెప్పించి అభివృద్ధి చేయాల్సి ఉండగా.. జగన్ ప్రభుత్వం అలా చేయడం లేదన్నారు. కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం చేయలేదన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని అమరావతి నుండి విశాఖకు తరలిస్తే రాయలసీమ వాసులకు చాలా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో వ్యవసాయ మోటర్లు ఎక్కువ. వీటికి మీటర్లు బిగిస్తే ఎక్కువగా నష్టం రైతులకు నష్టం జరుగుతుందన్నారు.

# గంగకాలువలో పడిన మహిళ మృతదేహం లభ్యం

**పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



కలసపాడుకు చెందిన యాదవ కులానికి చెందిన రాములమ్మ మృతదేహం ముసలిరెడ్డి పల్లె సమీపంలో దొరికిందని కలసపాడు ఎస్ఐ నాగమురళీ తెలిపారు. గత మూడు రోజులుగా మహిళ అదృశ్యమై నీటిలో కొట్టుకుపోవడం వలన గ్రామ ప్రజలు బంధువులు, పోలీసులు అధికారులు మహిళ మృతదేహం కోసం వెతుకులాట తెలిసిన విషయమే.ఎట్టకేలకు సోమవారం సాయంత్రంకు రాములమ్మ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# సౌమ్యనాథసేవా ట్రస్టుకు విరాళం

**నందలూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త**



నందలూరు మండలంలోని సౌమ్యనాథస్వామి ఆలయానికి అనుసంధానంగా ఉన్న శ్రీసౌమ్యనాథస్వామి సేవాట్రస్టుకు శాశ్వత అన్నదానం కార్యక్రమానికి విశ్రాంత ఎస్‌పి తోట తులసీరాం, వారి సతీమణి కీ.శే. వసంతకుమారి జ్ఞాపకార్థం 100116 రూపాయల చందాను ట్రస్టు అధ్యక్షుడు యెద్దల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యెద్దల సుబ్బరాయుడు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం జరిపించేందుకు శాశ్వత చందా అందజేసిన తులసీరాంకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, భరతాల శ్రీధర్‌బాబుయాదవ్, సాయి శష్పలత తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతే మహాసంపద

**న్యాయమూర్తి కె.లత**

**నందలూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త**

మనిషికి మానసిక ప్రశాంతత మహాసంపద అని మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్ కె.లత అన్నారు. మండలంలోని న్యాయస్థాన ప్రాంగణంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరికి మానసిక ఆరోగ్యం అత్యంత కీలకమని అన్నారు. మానసిక రుగ్మతలకు ఇబ్బంది పడేవారిని చులకనగా చూడడం మహాపాపమని, అలా ఇబ్బంది పడుతున్న బాధితులను గొలుసులతో నిర్బంధించడం, మాటలతో దూషించం తీవ్ర నేరంగా పరిగణిస్తారని ఆమె అన్నారు. మతిస్థిమితం కోల్పోయిన బాధితులకు 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్టు ప్రకారం ప్రత్యేక వైద్య సదుపాయాలు పొందవచ్చు అన్నారు. ప్రత్యేక చట్టాన్ని అమలుపరిచేందుకు జాతీయ స్థాయిలో సెంట్రల్, రాష్ట్ర స్థాయిలో స్టేట్ మెంటల్ ఎస్టాబ్లేష్‌మెంట్ సంస్థలు పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఇక జిల్లా స్థాయిలో మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డు అందుబాటులో ఉందన్నారు. మానసిక ఆరోగ్యం దెబ్బతినే పలు ప్రమాదకరమైన కారణాలను న్యాయమూర్తి వివరించారు. ప్రధానంగా చెడు వ్యసనాలు, డ్రగ్స్, దూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వంటి కారణాలతో మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. అనవసరమైన మానసిక ఒత్తిడి ప్రతి చిన్న విషయానికి కంగారు పడడం, పెరిగిన వాతావరణ, పరిసరాలు కూడ మానసిక రుగ్మతలకు దారి తీస్తాయని వివరించారు. మూఢ నమ్మకాలు, మంత్రాలను అతిగా విశ్వసించడం మానసిక ఆరోగ్యానికి చేటు కలిగిస్తుందన్నారు. ప్రతి మనిషి తన జీవన విధానంలో అవగాహనతో మానసిక ఆరోగ్యం దెబ్బతినకుండా నడుచుకోవాలన్నారు.కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు డి.నరసింహులు, ఎజిపి షమివుల్లా, మజీ ఎజిపి మహ్మద్ అలీ, లాయర్‌లు ఆనంద్‌కుమార్, సుబ్బరామయ్య, వెంకటసుబ్బయ్య, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనిని సందర్శించిన ఎంపిపి

**నందలూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త**



నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతిలో గల నారాయణ రాజుపేట గ్రామంలో ఇళ్ల స్థలాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి జగనన్న కాలనికి సుమారు 9 ఎకరాల భూమిని హద్దులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా జగనన్న కాలనిలు నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు దిశ నిర్దేశం చేయాలన్నారు. లబ్దిదారులకు వీలైనంత త్వరగా తమ సొంత ఇంటి కలలను నిజం చేసుకోవాలని, అందుకు కావాల్సిన పూర్తి ఏర్పాట్లు, తోడ్పాటును జగనన్న ప్రభుత్వం అందిస్తుందని ఆయన అన్నారు. వాలంటీర్‌లు, రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ డిపార్టుమెంట్‌లు ప్రజాసేవలో నిమగ్నమై ఉండాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు సిఎం కల నెరవేరేదిశగా జరుగుతున్నట్లు ఆయన సూచించారు. కాలనీ కట్టడాలకు అవసరమైన సిమెంట్, ఐరన్‌లు లబ్దిదారులకు లక్షా 80 వేలు అందుతుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. డ్వాక్రాలో ఉన్న మహిళకు డ్వాక్రా రుణాలు కూడా అందుతాయని తెలిపారు.కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనుదీప్ జయసింహా, జిల్లా మైనారీ ప్రధాన కార్యద ర్శి అమీర్, యువజన ప్రధాన కార్యదర్శి నడివీధి సుధాకర్, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్, వైసిపి నాయకులు విజయభాస్కర్, ప్రభు, శివ, వాలంటీర్‌లు జాస్మిన్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది

# రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**గాలివీడు, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



మండల రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని తహశీల్దార్ దైవాధీనంకి గాలివీడు ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, రైతుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వరమే రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పలు ప్రభుత్వ బిల్డింగ్‌లకు కావలసిన స్థలాలపై, జగనన్న కాలనీలలో నెలకొన్న సమస్యలపై ఎంపిపి తహశీల్దార్‌తో చర్చించారు. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న రైతుల సమస్యలపై ఆయన ఆరా తీసి తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు.

# రోడ్లపై గుంతలు పూడ్చిన పోలీసులు

**పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



పోరుమామిళ్ళ పట్టణంలోని ప్రధాన రోడ్లు గుంతల మయంగా మారాయి. ఇటీవలే కురుస్తున్న భారీ వర్షాలకు అనేకచోట్ల రోడుల దెబ్బతిన్నాయి. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. గత ఐదు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పోరుమామిళ్ళ ప్రధాన రహదారులు గుంతల మయంగా మారాయి. రహదారిపై అనేక చోట్ల రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదాలను నివారించేందుకుగాను పోలీసులు మట్టితో గుంతలను పూడా ్చరు. గుంతల రోడ్డులను పూడ్చడంపై చొరవ తీసుకోవడం పట్ల ప్రజలు ఎస్ఐ హరిప్రసాద్‌ను, పోలీసు సిబ్బందిని అభినందించారు.

# ఎడమ కాలువలో గల్లంతైన మృతదేహం లభ్యం

**బ్రహ్మంగారి మఠం, అక్టోబరు 10 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని తెలుగు గంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ నందు ఆదివారం దూకి గల్లంతై మృతిచెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. వివరాలలోకి వెళితే ప్రొద్దుటూరు సమీపంలోని కల్లూరు గ్రామానికి చెందిన కానాల ప్రకాష్ కుమారుడు నాగేంద్ర (27) బ్రహ్మంగారి మఠం సుందరయ్య కాలనీలో గత 6 నెలల క్రితం వివాహం చేసుకున్నట్లు సమాచారం. నాగేంద్ర ఆదివారం కాలువలో దూకేటపుడు తన తమ్ముడితో ఫోన్‌లో మాట్లాడుతూ ఏడుస్తున్నాడని, నేను చనిపోతున్నానని చెబుతూ కాలువలో పక్కనే మోటరు బైకు, ఆధార్ కార్డు, మొబైల్ అక్కడే ఉంచి కాలువలో దూకినట్లు సమాచారం. ఆదివారం సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా గంగిరెడ్డిపల్లె సమీపాన తెలుగు గంగ కాలువలో సోమవారం విగతజీవిగా కన్పించడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ములాయం సింగ్ యాదవ్‌కు ఘన నివాళి

**బద్వేలు అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త :70**



ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్ గత కొద్ది రోజులుగా గురుగావ్‌లోని వేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం మరింత క్షీణించడంతో తుదిశ్వాస విడిచా రు. ఈ సందర్భంగా స్థానిక నెల్లూరు రోడ్‌లోని కృష్ణ మందిరం నందు మూడు పర్యాయాలు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఏడు పర్యాయాలు పార్లమెంటు సభ్యులుగా, 60 సంవత్సరాలు రాజకీయ జీవితంలో 18 ఎన్నికల్లో 16 సార్లు గెలుపు సాధించిన అపార మేధా రాజకీయ నాయకుడని బీసి, ఎస్సీ, ఎస్టీ, మైనా రిటీల అభివృద్ధికి బాటలు వేసిన మండల్ యోధుడని యాదవ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కావేటి రమేష్ యాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామి యాదవ్, రామనబోయిన శ్రీనివాసులు యాదవ్, దొండపాటి రమణ యాదవ్, పలువురు యాదవులు వారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

# శివాలయం రహదారిలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి

**మున్సిపల్ ఛైర్మెన్‌కు బిజేపీ నాయకుల వినతి**

**బద్వేలు అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు రోడ్ నుండి రూపరాంపేట శివాలయంకు వెళ్ళే రహదారి అనేక సంవత్సరాలుగా మరమ్మత్తులకు కూడా నోచుకోని దయనీయ పరిస్థితిలో ఉందని, త్వరలో కార్తీక మాసం వస్తుందని, ప్రసిద్ధి చెందిన అత్యంత పురాతన రూపరాంపేట శివాలయంలోని స్వామివారిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలిరావడం జరుగుతుందని, అయితే గతంలో కార్తీక మాసంలో వర్షాలు పడినపుడు ఆ రహదారిలో వాహనదారులు, పాదాచారులు వెళ్ళాలంటే అనేక ఇబ్బందులకు గురయ్యారని, కావున బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూ.130 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని, ఆ నిధులలో శివాలయంకు వెళ్ళే రహదారిలో సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని సోమవారం బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేలు తాలూకా రైతు సంఘ కార్యదర్శి పుల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మున్సిపల్ ఛైర్మెన్ అతి త్వరలోనే శివాలయంకు వెళ్ళే రహదారిలో సీసీ రోడ్డును ఏర్పాటు చేస్తామని ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో చాలా వార్డులలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని, మరి కొన్ని వార్డులలో కూడా త్వరలోనే సీసీ రోడ్లు పూర్తి చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామనా తెలిపారు.

# పంటలకు రసాయనాలు వద్దు కషాయాలు వాడుదాం

**– ఉత్తమ మహిళా రైతు సూరం శ్రీదేవి**

**రామాపురం, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



భూసారాన్ని క్షణింప చేసే రసాయన పద్ధతులు వద్దని భూసారాన్ని కాపాడుకుంటూ కషాయాలతో పంటలను సాగు చేసుకుందామని ప్రకృతి వ్యవసాయ ఉత్తమ మహిళా రైతు సూరం శ్రీదేవి సూచించారు. మండలంలోని నలుగుటపల్లె కొత్తపల్లిలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు అవసరమైన పంటలు సాగు చేయదలచిన రైతులు ముందుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంభించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక రసాయనాలు వాడడం వల్ల భూమి ఆస్థితి కోల్పోయి పంటల దిగుబడులు తగ్గిపోవడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి క్షీణించి రైతులను తీవ్ర నష్టాలు పాలవుతారన్నారు. రైతులు రసాయనాలు మాని కషాయాలను ఎంచుకొని మంచి దిగుబడిని అర్జించి అధిక లాభాలు పొందాలని ఆమె సూచించారు. వీటితో పాటు ప్రతి కుటుంబం తన పెరటికోటలో తన నిత్యావసరానికి అవసరమైన కూరగాయలను పండించుకునేందుకు కిచెన్ గార్డెన్ ఉపయోగించుకొని తమ ఇళ్లలోనే స్వచ్ఛమైనకూరగాయలు, ఆకుకూరలు వేసుకుని పండించుకోవచ్చన్నారు.

# లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలి : 16వ వార్డులో ప్రజలకు అవగాహన**

**బద్వేలు అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త :**



లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని 16, 17 వార్డుల సచివాలయ మహిళా పోలీసు మీనా అన్నారు. సోమవారం మధ్యాహ్నం 16వ వార్డు మేదర కాలనీలో పలువురు మహిళలకు పిలుపునిచ్చి వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా పోలీసు మీనా మాట్లాడుతూ లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌లు, సైబర్ నేరగాళ్ళ నుండి ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లేదంటే 1930 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రజలకు రక్షణ కల్పించే విధంగా మహిళా పోలీసులు వార్డులో నిరంతరాయంగా తిరుగుతూ ఉంటామని, ఎవరి ఎటువంటి అవసరం వచ్చినా తమకు ఒక ఫోన్ చేస్తే వారి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఎవరైనా వీధుల్లో గుర్తు తెలియని వ్యక్తులు రకరకాల వ్యాపారాల పేరుతో మీ ఇంటి వద్దకు వచ్చినపుడు వారిని ఎట్టి పరిస్థితుల్లో ఇంటి వద్దకు రానివ్వవద్దన్నారు. ప్రస్తుత పరిస్థితులలో సైబర్ నేరగాళ్లు ఏదో విధంగా ప్రజలను మోసం చేస్తున్నారని, వారి పట్ల తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పలువురు మహిళలకు పోలీసు చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు లలిత, పావని మరియు స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేనిదే టపాసులు విక్రయించరాదు

**– సీఐ వెంకటేశ్వర్లు**

**బద్వేలు, అక్టోబరు 10 ప్రభాతవార్త :**

దీపావళి వస్తున్న నేపథ్యంలో టపాసులు అనుమతి లేనిదే విక్రయాలు జరపకూడదని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. అధికారుల నుండి అనుమతులు పొందాకే విక్రయాలు జరపాలని పట్టణంలోని పలువురు వ్యాపారస్తులకు సూచనలు జారీ చేశారు. సోమవారం వ్యాపారస్తులకు టపాసులు విక్రయాల కొరకు దరఖాస్తు చేసుకునే వారికి సూచనలు ఇచ్చారు. ఎవరైనా పట్టణంలో టపాసులు అమ్మాలంటే అధికారుల నుండి ఉత్తర్వులు వచ్చిన తరువాతనే విక్రయాలు జరపాలి తప్ప, ఇష్టానుసారంగా విక్రయాలు జరపడం, టపాసులు నిల్వ ఉంచుకోవడం జరిగితే మాత్రం అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పరమేశ్వరరెడ్డి హత్య కేసులో నిష్పక్షపాతంగా విచారణ

**ఇప్పటికే ఐదు మందిని అరెస్టు చేశాం**

**జిల్లా ఎస్పీ అన్బురాజన్**

**కడప, అక్టోబర్ 10, ప్రభాతవార్త:**

జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన పరమేశ్వర రెడ్డి అనే వ్యక్తి హత్య కేసులో నిష్పక్షపాతంగా ధర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో ఐదు మందిని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు ఎస్పీ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని హత్యలో మిగితావారి పాత్ర ఉన్నట్లు తేలితే వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. ఎవరివద్ద అయిన ఈ కేసుకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసధికారులకు తెలియజేయాలన్నా రు. అవాస్తవాలను ప్రచారం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పాటు పడాలి

**జిల్లా 3వ అదనపు జడ్జి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ**

**రాజంపేట అర్బన్ అక్టోబరు 10 ప్రభాతవార్త**



రాజంపేట కోర్టు ఆవరణంలో నవంబరు 12న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో వీలైనన్ని కేసులు కక్షిదారులు పరస్పరం రాజీపడి సమస్యలు పరిష్కరించుకొనేలా పాటుపడాలని జిల్లా 3వ అదనపు షసన్స్ జడ్జి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ కోరారు. సోమవారం కోర్టు ఛాంబర్‌లో జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించి రాజంపేట సబ్‌డివిజన్ పరిధిలోని డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖ పరంగా కక్షిదారులను అవకాశం ఉండే కేసుల్లో రాజీపడేలా పనిచేయాలన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి, డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, సిఐలు నరసింహరాజు, పుల్లయ్య, విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ బత్సవత్సలం పాల్గొన్నారు.

# మానసిక రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలి

**జూనియర్ సివిల్‌జడ్జి ఎం.సంధ్యారాణి**

**రాజంపేట అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త**



ఆసుపత్రులకు వచ్చిన మానసిక రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది మానవత్వంతో వ్యవహరించాలని రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి కోరారు. అలా కాకుండా మానసిక రోగుల పట్ల దురుసుగా చిన్నచూపు చూడడం ఏమాత్రం సరికాదన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ మానసిక రోగుల పట్ల జాలితో వ్యవహరించాలని, అసహ్యంచుకొనేలా వ్యవహరించకూడదని హితవు పలికారు. ఒకవిధంగా చెప్పాలంటే మానసిక రోగుల పట్ల గౌరవంతో వ్యవహరించాలన్నారు. అప్పుడే మానసిక రోగులు తమ జీవనాన్ని ధైర్యంగా కొనసాగించగలుగుతారన్నారు. ప్రస్తుత స్పీడు యుగంలో ఎక్కువగా ఆలోచించడం ద్వారా మానసిక రోగులు ఎక్కువ అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ పివిఎస్ రాజు, న్యాయవాది టిఎన్ శ్రీనివాసులు, పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చుక్కాయపల్లె ముంపు నిర్వాసితులకు పక్కాఇళ్లు

**రాజంపేట అర్బన్, అక్టోబరు 10 ప్రభాతవార్త**



సోమశిల ప్రాజెక్టు కింద ముంపునకు గురైన నందలూరు మండలంలోని చుక్కాయపల్లె, చాపలవారిపల్లె గ్రామాల నిర్వాసితులకు పోలి సమీపంలో పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలి, చిన్నిల్లుగారిపల్లె మధ్యలో లేఅవుట్ వేసేందుకు సిద్ధం చేసిన భూములను ఎమ్మెల్యే ఆర్‌డిఒ కోదండరామిరెడ్డితో కలిసి పరిశీలించారు. ముంపు బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు ఎం.సుబ్రమణ్యంరెడ్డి, సర్వేయర్, వెంకటసుబ్బయ్య, మాజీ మార్కెట్‌కమిటి ఛైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, ఆకేపాటి మురళి, నాగాసుధాకర్‌రెడ్డి, చుక్కాయపల్లె క్రిష్ణయ్య, మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, లేబాకు నాగేంద్ర, సుబ్బరాజు, ముంపు నిర్వాసితులు పాల్గొన్నారు.

# వెంకట లక్ష్మమ్మను పరామర్శించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**రాయచోటి, అక్టోబర్ 10ప్రభాతవార్త:**



రాయచోటి మండలం దిగువ అబ్బవరం పంచాయతీ కమ్మ పల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నాగార్జుననాయుడు తల్లి వెంకటలక్ష్మమ్మను సోమవారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఆమె యొక్క ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ధైర్యం చెప్పి త్వరలో ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఈయన వెంట తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాకు ప్రాణ హాని ఉంది

**– నాకు ఏమి జరిగినా సీఎం జగన్ బాధ్యత వహించాలి**

**– వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి**

**కడప, అక్టోబరు 10, ప్రభాతవార్త:**



అధికార పార్టీకి చెందిన వైకాపా నాయకులతో తనకు ప్రాణ హాని ఉందని తనకేమైనా జరిగితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలని వివేకా హత్య కేసులో ముద్దాయిగా ఉండి అప్రూవర్‌గా మారిన దస్తగిరి తెలిపారు. తనకు రక్షణ కల్పించాలని ఈ మేరకు సోమవారం కడప ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా గన్‌మెన్లను మార్చారని దస్తగిరి మీడియాతో ఆరోపించారు. గన్‌మెన్లను మార్చడంపై దస్తగిరి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ ఏఎస్పీ రాంసింగ్ ఆదేశాలతోనే కడప ఎస్పీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. తొండూరు మండలం వైకాపా నేతలు తనపై కేసులు పెట్టిస్తున్నారని ఈ సందర్భంగా వాపోయాడు. ఈ విషయమై గతంలో జిల్లా ఎస్పీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను సోమవారం ఎస్పీని కలిసేందుకు వచ్చినప్పటికీ తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. తనకు ప్రాణహాని ఉందని, తనకేమైనా జరిగితే సీఎం బాధ్యత వహించాలన్నారు.

# స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు : ఆర్‌డిఒ

**మదనపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త :**



స్పందనాలో ప్రజలు విన్నవించే ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమంలో మదనపల్లె, తంబళ్ళపల్లె,పీలేరు నియోజక వర్గాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను ఆర్డీఓకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను బట్టి గడువులోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసు కోవడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్య క్రమాన్ని రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ప్రజలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. మున్సిపాలిటిలో జరిగిన స్పందనకార్యక్రమంలో ప్రజలు ఛైర్‌పర్సన్ మనూజారెడ్డికి సమస్యలను విన్నవించారు.పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.